సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం, 6, మే, 2024



సోమశిలలో 8.06 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 8.06 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 210 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.73,530
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,586
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,784
సవర (8 గ్రాములు)	రూ.54,272



ప్రశాంతంగా నీట్

నెల్లూరు(అర్బన్): వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన నీట్ జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో 3389 మంది దరఖాస్తు చేసుకోగా, 3296 మంది హాజరయ్యారు.

న్యూస్‌రీల్

నోటుతో ఓటుకు ఎర

• వీఓఏలకు గాలం వేసిన వీపీఆర్



వీపీఆర్ ఫంక్షన్ హాల్ వద్ద వీఓఏలు

కోవూరు: ఎన్నికల్లో విజయమే పరమావధిగా టీడీపీ నెల్లూరు లోక్‌సభ, కోవూరు అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు డబ్బులను ఏరులై పారిస్తున్నారు. తాజాగా బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని వీఓఏలకు వీరు గాలం వేశారు. కనుపర్తిపాడులోని వీపీఆర్ ఫంక్షన్ హాల్‌కు వీఓఏలను ఏపీఎం లలిత ఆదివారం తెల్లవారుజామున 4.30కు తీసుకెళ్లారు. అక్కడ వీఓఏలకు రూ.25 వేల చొప్పున అందజేశారని సమాచారం. ఈ ప్రక్రియకు సహకరించిన ఏపీఎం లలితకు భారీగా ముట్టజెప్పారని తెలుస్తోంది. కాగా ఇలాంటి వారిని విధుల నుంచి వెంటనే తొలగించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆరిఫ్ హఫీజ్

నెల్లూరు(క్రైమ్): సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలని ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆదేశించారు. నగరంలోని డీకేడబ్ల్యూ, వీఆర్ కళాశాలల్లోని పోలింగ్, ఫెసిలిటేషన్ కేంద్రాలను ఆదివారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. పోలింగ్ రోజున కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో ఓటర్లు మినహా ఇతరులెవరూ ఉండకుండా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ముందస్తు భద్రత చర్యలు చేపట్టామని వివరించారు. ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వీరిపై సీ విజిల్ యాప్, టోల్ ఫ్రీ నంబర్ 112 లేదా స్థానిక పోలీస్‌స్టేషన్లకు సమాచారం అందించాలని కోరారు. ఎస్పీ, చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణారెడ్డి, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఓపీ సేవలందించాలి

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వ నిబంధనలను అనుసరించి ప్రైవేట్ వైద్యశాలల్లో సైతం పేదలకు 20 శాతం ఉచిత ఓపీ వైద్యసేవలందించాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య సూచించారు. నగరంలోని మినీబైపాస్ రోడ్డులో శారదా హాస్పిటల్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఆస్పత్రి డాక్టర్లు సుప్రజ, విజయలక్ష్మి, నిరుపమ, రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి, చిన్నపిల్లల చీఫ్ కార్డియాలజిస్ట్ నాగేశ్వరరావు, ఐఎంఏ రాష్ట్ర నేత అశోక్, వైద్యులు గోవిందు, పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మీ సేవలు... మాకొద్దు



కీలక నేతలను దూరం పెట్టిన టీడీపీ

• ఆత్మకూరులో కన్నబాబును పట్టించుకోని ఆనం
• నెల్లూరులో పట్టాభిని పక్కనబెట్టిన నారాయణ
• మీ సహకారం మాకొద్దని తేల్చిచెప్పిన అభ్యర్థులు
• ఇంటికే పరిమితమైన ఈ నేతలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: తెలుగుదేశం పార్టీకి దశాబ్దాలుగా ఊడిగం చేసినా చివరికి వారు కరివేపాకులుగా మారుతున్నారు. తాజాగా ఆత్మకూరులో సీనియర్ నేతగా ఉన్న కన్నబాబుకు, నెల్లూరు నగరంలో మాజీ మంత్రి నారాయణ శిష్యుడు పట్టాభికి ఎన్నికల వేళ అవమానాలు ఎదురవుతున్నాయి. ఎన్నికల షెడ్యూల్ వరకు పార్టీలో అన్నీ తామే అంటూ విర్రవీగిన నేతలు ప్రస్తుతం సొంత నియోజకవర్గానికే ముఖం చాటేసే పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల సమయంలో నియోజకవర్గ ఓటర్లకు మీ మొహం చూపొద్దని.. ప్రక్రియలో పాల్గొనవద్దని ఆ పార్టీ అభ్యర్థులు ఖరాఖండీగా చెప్పడంతో ఈ ఇద్దరు నేతలు అవమానంగా భావించారు. ఈ తరుణంలో తమ అనుచరులకు మొహం చూపించలేని స్థితిలో ఉన్నారు. 2014 ఎన్నికల సమయంలో ఆత్మకూరులో టీడీపీకి అభ్యర్థి కరువవ్వడంతో స్థానికంగా ఉన్న కన్నబాబే దిక్కయ్యారు. ఓటమి తప్పదని తెలిసినా, అభ్యర్థిగా రంగంలోకి దిగి నష్టపోయారు. మరోసారి 2019లో టికెట్ వస్తుందని భావించిన కన్నబాబుకు చుక్కెదురైంది. కాంగ్రెస్ తరఫున గతంలో ఎమ్మెల్యేగా గెలిచిన బొల్లినేని కృష్ణయ్యకు టీడీపీ అవకాశం కల్పించింది. బొల్లినేని పారిశ్రామికవేత్త కావడంతో ఎన్నికల వేళ మినహా ఎప్పుడూ నియోజకవర్గంలో కనిపించరు. పార్టీ కార్యకర్తలకు ఏనాడూ చేరువ కాలేదు. ఎన్నికల వేళ తప్ప దర్శనమివ్వని నేతకు టికెట్ ఇచ్చారు. అందరూ అనుకున్న మాదిరిగానే ఆయన ఓటమిపాలయ్యాక నియోజకవర్గానికి ముఖం చాటేశారు. దశాబ్దకాలం పాటు పార్టీలో అవమానాలు ఎదురైనా.. ఆ పార్టీనే అంటిపెట్టుకొని ఉన్న కన్నబాబుకు ఈ ఎన్నికల్లోనూ మొండిచేయి చూపారు. చివరికి వైఎస్సార్‌సీపీ బహిష్కృత నేత ఆనానికి టికెట్ ఇచ్చారు. ఆత్మకూరులో ఆనం బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి కన్నబాబును దగ్గరికి రానివ్వలేదు. పార్టీ వ్యవహారాల్లో సైతం తలదూర్చనివ్వలేదు. లోకేశ్ చేపట్టిన యువగళం యాత్రకూ కన్నబాబుకు ఆహ్వానం అందలేదు. ఎన్నికల వేళ కన్నబాబును ఆనం మరింత చిన్నచూపు చూశారు. ఎన్నికల సమయంలో ఆత్మకూరులో మీ మొహం చూపొద్దని అధిష్టానం ద్వారా చెప్పించారు. దీంతో తీవ్ర అవమాన భారంతో ఆత్మకూరు వదిలి నెల్లూరు నగర నియోజకవర్గంలో మాజీ మంత్రి నారాయణ వద్దకు చేరుకొని అక్కడ వ్యవహారాలు చూస్తున్నారు. తనకు జరిగిన అవమానాలను తలచుకొని తన ఆంతరంగికుల వద్ద కన్నీరు పెట్టుకున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

పట్టాభికి భంగపాటు

దశాబ్దకాలంగా నెల్లూరు రాజకీయాల్లో లోకేశ్ వర్గంగా హడావుడి చేసిన మాజీ మంత్రి నారాయణ శిష్యుడు పట్టాభిరామిరెడ్డికి ఎన్నికల వేళ భంగపాటు తప్పలేదు. తన గురువుగా ఉన్న నారాయణ నెల్లూరు నగర నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా ఉన్నా, సహాయకారిగా పనిచేసేందుకు కూడా పనికిరాడని భావించి పక్కనబెట్టారు. గత ఎన్నికల్లో నారాయణ గెలుపు బాధ్యతలను తీసుకొని అన్నీ తానై నడిపించారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభంజనంలో నారాయణ ఓటమి చెందడంతో ఆ నెపాన్ని పట్టాభిపై నెట్టేశారు. ఐదేళ్ల పాటు నెల్లూరుకు ముఖం చాటేసి వ్యాపారాల్లో నారాయణ బిజీ అయిపోయారు. కానీ పట్టాభి మాత్రం లోకేశ్ వర్గంగా ఉంటూ పార్టీ వ్యవహారాల్లో తలదూర్చుతూ ఐదేళ్లపాటు హడావుడి చేశారు. తీరా ఎన్నికల వేళ నారాయణ మరోసారి బరిలోకి దిగి పట్టాభిని పక్కనబెట్టేశారు. ఇందుకు మరో కారణమూ ఉందనే చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. నెల్లూరు నగర టీడీపీలో ఉన్న సీనియర్ నేత కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఈ దఫా పట్టాభి ఉంటే తాను ఎలక్షనీరింగ్ చేయమని తెగేసి చెప్పారని, దీంతో ఆయన్ను నారాయణ దూరం పెట్టారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ పరిణామాలతో పట్టాభి ఇంటికే పరిమితమయ్యారని తెలుస్తోంది.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోండి

• జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్

కందుకూరు: పోస్టల్ బ్యాలెట్ ద్వారా ప్రభుత్వోద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాన్ని సబ్ కలెక్టర్ విద్యాధరితో కలిసి ఆదివారం పరిశీలించారు. ఓటింగ్ సరళిని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఓటింగ్‌కు ఈ నెల ఎనిమిది వరకు అవకాశం ఉందని తెలిపారు. ఎలక్షన్ డ్యూటీ ఆర్డర్ ఉండి ఫారం – 12ను ఇవ్వలేకపోయిన వారికీ ఓటేసే అవకాశాన్ని కల్పిస్తున్నామని తెలిపారు.



హోమ్ ఓటింగ్‌ను పరిశీలిస్తున్న హరినారాయణన్

హోమ్ ఓటింగ్ ప్రక్రియ పరిశీలన

హోమ్ ఓటింగ్ ప్రక్రియను హరినారాయణన్, విద్యాధరి పరిశీలించారు. పట్టణంలో ఓ వృద్ధుడు తన ఇంటి వద్ద ఓటేసే విధానాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

పోలింగ్ జాతర షురూ..

పోలింగ్‌కు తొలి అంకంగా నిర్వహించే పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా ఆదివారం ప్రారంభమైంది. నెల్లూరులోని డీకే డబ్ల్యూ, వీఆర్ లా కళాశాలల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాల్లో ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్



ఓటేసేందుకు బారులుదీరిన ఉద్యోగులు



డీకేడబ్ల్యూ కళాశాలలో..



వీఆర్ లా కళాశాలలో..

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తే స్వర్ణయుగం

• త్వరలో దామవరం విమానాశ్రయ ఏర్పాటు
• పరిశ్రమలతో భారీగా ఉద్యోగావకాశాలు
• వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలి
• పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి



ప్రజలకు అభివాదం చేస్తున్న విజయసాయిరెడ్డి, పక్కన ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే జిల్లాతో పాటు కావలి నియోజకవర్గానికి స్వర్ణయుగం రానుందని పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. దగదర్తి మండలంలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారాన్ని పార్టీ కావలి అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి విజయసాయిరెడ్డి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదలకు అండగా ఉండే తమ పార్టీకి.. పెత్తందారుల పక్షాన ఉండే టీడీపీ, బీజేపీ, జనసేనకు మధ్య ఈ ఎన్నికల పోరు జరుగుతోందని చెప్పారు. రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె హార్బర్‌తో తీర ప్రాంతంలో భారీగా ఉద్యోగావకాశాలకు పునాదిని తమ పార్టీ వేసిందని తెలిపారు. ఎన్నికల అనంతరం దామవరం వద్ద అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేయనున్న విమానాశ్రయం, పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా నెలకొల్పనున్న పరిశ్రమలతో ఈ ప్రాంత రూపురేఖలే మారనున్నాయని ప్రకటించారు. విమానాశ్రయం, పరిశ్రమలతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు భారీగా పెరగడంతో పాటు ప్రజల తలసరి ఆదాయం, జీవన ప్రమాణాలూ పెంపొందుతాయని వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయంతో దగదర్తి మండలం పట్టణ హోదాను సంతరించుకోనుందని తెలిపారు. మండల పరిధిలోని 22 పంచాయతీల్లో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అబద్ధాలే చంద్రబాబు అజెండా

ఎన్నికల సమయంలో అన్ని పార్టీలతో పొత్తు పెట్టుకొని ఆచరణ సాధ్యం కాని హామీలను గుప్పించడమే చంద్రబాబు అజెండా అని విజయసాయిరెడ్డి ధ్వజమెత్తారు. 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు తన మేనిఫెస్టోలో ఎన్ని హామీలను నెరవేర్చారో అందరికీ తెలుసునన్నారు. బూటకపు హామీలివ్వడం.. అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను పరిపూర్ణంగా అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. కుల, మత, పార్టీలకతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలను అందించామని తెలిపారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి గానూ తమ పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ, పార్టీ మండల కన్వీనర్ ప్రసాద్‌నాయుడు, అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాకర్ల విజయం క్లిష్టమే..!

• వివాదాస్పదమైన బొల్లినేని వ్యాఖ్యలు
• భగ్గుమన్న సురేష్ వర్గీయులు
• తమ్ముళ్లలో అంతర్మథనం

ఉదయగిరి: టీడీపీ ఉదయగిరి అభ్యర్థి కాకర్ల సురేష్ విజయం అంత సులువు కాదంటూ ఓ యూట్యూబ్ చానల్‌తో ఆ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు చేసిన వ్యాఖ్యలు తమ్ముళ్లలో అంతర్మథనానికి దారితీశాయి. దీనిపై కాకర్ల సురేష్ వర్గీయులు భగ్గుమంటున్నారు.

రాజకీయ ప్రకంపనలు

ఎన్నికలకు మరో వారం రోజుల వ్యవధి ఉంది. ఈ తరుణంలో టీడీపీ విజయానికి సహకరిస్తామంటూనే.. ఉదయగిరిలో టీడీపీ గెలుపు అంత తేలిక కాదన్న బొల్లినేని వ్యాఖ్యలు నియోజకవర్గ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. 2012 నుంచి నియోజకవర్గంలో టీడీపీని.. కేడర్‌ను సర్వశక్తులొడ్డి కాపాడుకుంటూ వచ్చానని.. అయితే అధిష్టానం తనకు ఒక్క మాట కూడా చెప్పకుండా ఎన్నారై కాకర్ల సురేష్‌కు టికెట్ ఇవ్వడాన్ని జీర్ణించుకోలేకపోయానని చెప్పారు. అయినా అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు ఉదయగిరిలో సురేష్ విజయానికి సహకరించాలని భావించానని, ఆయన తనకు తగిన గౌరవమివ్వడంలేదని తెలిపారు. నామినేషన్ సమయంలో తాను నియోజకవర్గంలోనే ఉన్నా, ఆహ్వానం అందకపోవడంతో మనస్తాపానికి గురై హైదరాబాద్ వెళ్లానని సదరు యూట్యూబ్ చానల్‌తో చెప్పారు.

ఆయన ప్రవర్తన సక్రమంగా లేదు

వాస్తవానికి ఈ ఎన్నికల్లో టీడీపీ తరఫున ప్రచారం చేయడం తనకిష్టం లేదని.. అయితే మాజీ ఎమ్మెల్యేలు కంభం విజయరామిరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్ మాట కాదనలేక తాను ప్రచారం చేయాలని భావించానని చెప్పారు. అయితే ఇక్కడి అభ్యర్థి ప్రవర్తన సక్రమంగా లేదన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో తొమ్మిది సార్లు కాంగ్రెస్, వైఎస్సార్‌సీపీయే విజయం సాధించాయని.. టీడీపీ రెండుసార్లే గెలుపొందిన అంశాన్ని ప్రస్తావించారు. దీని బట్టి కాకర్ల విజయం అంత తేలిక కాదని వ్యాఖ్యానించడం కేడర్‌లో తీవ్ర అయోమయానికి దారితీసింది.

రగిలిపోతున్న కాకర్ల వర్గీయులు

ఉదయగిరి సీటును తమ నేతకు ఖరారు చేసిన నాటి నుంచి పార్టీకి నష్టం కలిగించేలా బొల్లినేని వ్యవహరిస్తున్నారని కాకర్ల వర్గీయులు మండిపడుతున్నారు. ఉదయగిరిలో కాకర్ల విజయం సాధిస్తారనే సమాచారంతో జిల్లా కేంద్రానికి బొల్లినేని వచ్చారని, అయితే ఇక్కడ టీడీపీ గెలవదంటూ చేసిన వ్యాఖ్యలు పార్టీకి నష్టం కలిగించేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 40 రోజులుగా పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉన్నారని.. ఈ వారంలో ఆయనతో తమకు ఒరిగేదేమీలేదని.. కేవలం పార్టీకి నష్టం కలిగించేందుకే ఉదయగిరి వచ్చారని కాకర్ల వర్గీయులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు బొల్లినేని వ్యవహార శైలి కాకర్ల కొంపముంచేలా ఉందని టీడీపీ కేడర్ అంతర్గతంగా చర్చించుకుంటోంది.

ఓటింగ్ శాతం పెంపే లక్ష్యం



ప్రచార రథాలను ప్రారంభిస్తున్న అధికారులు

నెల్లూరు(బారకాసు): జిల్లాలోని ఓటర్లలో చైతన్యం తీసుకొచ్చి పోలింగ్ శాతాన్ని పెంచడమే ప్రధాన లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించే ప్రచార రథాలను నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. అన్ని నియోజకవర్గాల్లో ఈ నెల 12వ వరకు ప్రచార రథాల ద్వారా అవగాహన కల్పించనున్నామని వివరించారు. అనంతరం ఓటర్లను చైతన్యపర్చేలా మస్కట్, బెలూన్‌ను ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఆవిష్కరించారు. నోడల్ అధికారులు బాపిరెడ్డి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు గడువు పొడిగింపు

నెల్లూరు(దర్గామిట్ట): పోస్టల్ బ్యాలెట్ దాఖలుకు సంబంధించిన గడువును ఈ నెల ఎనిమిది వరకు పొడిగించారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో విధుల్లో ఉన్న ఇతర జిల్లాల వారు అక్కడ ఫారం – 12ను అందజేసి పోస్టల్ బ్యాలెట్‌ను పొందాలని సూచించారు.

తొలి రోజు 6251 ఓట్లు

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో తొలి రోజు 6251 ఓట్లు పోలయ్యాయి. నెల్లూరు సిటీలో 2419 మందికి గానూ 812.. నెల్లూరు రూరల్‌లో 4304కు గానూ 1372.. కందుకూరులో 1635 గానూ 573.. కావలిలో 2933కు గానూ 870, ఆత్మకూరులో 2352కు గానూ 706, ఉదయగిరిలో 2336 గానూ 711, సర్వేపల్లిలో 1268కు గానూ 387, కోవూరులో 2587కు గానూ 820 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కందుకూరులో.. ఇక దూకుడే

కందుకూరులో విజయం మాదేనంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు.. వైఎస్సార్‌సీపీ నేతల్లో సఖ్యత కరువైందంటూ ప్రతిపక్ష టీడీపీ అసత్య ప్రచారాలను వ్యాప్తి చేసి పైశాచికానందం పొందింది. అయితే ఈ వదంతులు సైకిల్ పార్టీ సృష్టేననే విషయం ప్రజలకు అవగతమైంది. నియోజకవర్గంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల నిర్వహించిన ఎన్నికల ప్రచారం ద్వారా ఈ అనుమానాలు.. ఊహాగానాలు.. అసత్య ప్రచారాలకు చెక్ పెడింది. ఈ ఒక్క సభ నియోజకవర్గంలో రాజకీయ ముఖచిత్రాన్నే మార్చేసిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



ఇటీవల నిర్వహించిన ఓ కార్యక్రమంలో బుర్రా, మహీధర్‌రెడ్డి

• సీఎం సభ తర్వాత మారిన పరిస్థితులు
• వైఎస్సార్‌సీపీలో నూతనోత్సాహం
• ఏకతాటిపైకి మానుగుంట.. బుర్రా
• టీడీపీ దుష్ప్రచారానికి చెక్

కందుకూరు: ఒకే ఒక్క బహిరంగ సభ కందుకూరు రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేసింది. గెలుపు తమదేనంటూ నిన్నామొన్నటి వరకు అసత్యాలు పలికి ఆనందపడిన టీడీపీ దీని ద్వారా పూర్తిగా చతికిలపడగా, వైఎస్సార్‌సీపీలో నూతనోత్సాహం నెలకొంది. కందుకూరు పట్టణంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సభకు కనీవినీ ఎరుగని రీతిలో అభిమాన తరంగం హాజరైంది. కార్యక్రమం విజయవంతం కావడంతో ఎన్నికలకు ముందే ప్రతిపక్ష పార్టీలకు మైండ్ బ్లాకైంది. మరోవైపు సమరోత్సాహంతో ఎన్నికలకు పూర్తి స్థాయిలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సై అంటున్నాయి.

నామినేషన్.. సభ.. ఇలా ప్రతిదీ జాతరే..

కందుకూరులో వైఎస్సార్‌సీపీ నిర్వహించే ప్రచార సభలు ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారాయి. పార్టీ నియోజకవర్గ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ తన నామినేషన్‌ను గత నెల 24న దాఖలు చేశారు. కార్యక్రమానికి హాజరైన జనసందోహం ఓ రికార్డుగా మిగిలిపోయింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని ఏరియా హాస్పిటల్ కూడలిలో సీఎం నిర్వహించిన బహిరంగ సభ మరో రికార్డును క్రియేట్ చేసింది. వారం వ్యవధిలోనే పార్టీ నిర్వహించిన ప్రతి కార్యక్రమం జాతరలా మారిందంటే అతిశయోక్తి కాదు.

అయ్యో.. అయ్యయ్యో..

తండోపతండాలుగా వచ్చిన జనంతో ప్రతిపక్ష పార్టీలకు కంటిమీద కునుకు కరువైంది. ఈ పరిణామాలతో ఉన్న కొద్ది ఆశలనూ టీడీపీ వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమనే సంకేతాలు వెలువడుతున్నాయి.

అపోహలకు చెక్

కందుకూరులో అపోహలను రేకెత్తించేందుకు టీడీపీ విశ్వప్రయత్నం చేసింది. అయితే వీటికి చెక్ పెడుతూ ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కందుకూరు అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ ఏకతాటిపైకి వచ్చి పార్టీ విజయానికి కృషి చేస్తున్నారు. బుర్రా నామినేషన్ సందర్భంగా నిర్వహించిన భారీ ర్యాలీకి మహీధర్‌రెడ్డి హాజరై కేడర్‌ను ఉత్తేజపర్చారు. ఎన్నికల్లో లబ్ధి పొందాలనే దురుద్దేశంతో ప్రతిపక్ష టీడీపీ చేస్తున్న అసత్య ప్రచారాలు, అపోహలకు మహీధర్‌రెడ్డి పూర్తిగా చెక్ పెట్టినట్లయింది. మహీధర్‌రెడ్డి సూచనలు, సలహాలను పాటిస్తూ ఆయన మార్గదర్శకత్వంలోనే పనిచేస్తానని బుర్రా ఇటీవల బహిరంగంగా ప్రకటించారు. దీంతో కార్యకర్తలు, నేతల్లో నెలకొన్న అపోహలు తొలగిపోయాయి.

మహీధరన్నను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటా..

ఎమ్మెల్యే పదవి త్యాగాన్ని గుర్తిస్తూ.. మహీధరన్నను గుండెల్లో పెట్టి చూసుకుంటానని.. ఆయనకు ఎమ్మెల్సీ పదవిచ్చి చట్టసభల్లో కూర్చొనేలా చర్యలు చేపడతానని సీఎం ప్రకటించారు. దీంతో పార్టీలో మహీధర్‌రెడ్డికి సముచిత స్థానం ఉంటుందనే అంశంపై క్లారిటీ లభించింది. దీనిపై ఆయన అనుచరులు, అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రసన్న మీవాడు.. అందుబాటులో ఉంటాడు

- వేమిరెడ్డి దంపతులను కలవాలంటే విదేశాలకు వెళ్లాల్సిందే..
- వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి


మాట్లాడుతున్న ఎంపీ విజయసాయిరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్‌: 'టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి ప్రశాంతిరెడ్డిని గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండరు. వారిని కలవాలంటే సింగపూర్, దుబాయ్, అమెరికాకు వెళ్లాల్సి ఉంటుంది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మీవాడు. నిత్యం అందుబాటులో ఉంటాడు. ఆయన్ను భారీ మెజార్టీతో గెలిపించండి' అని వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి అన్నారు. మండలంలోని దామరమడుగు, రేబాల గ్రామాల్లో ఆదివారం వారిద్దరూ ఎన్నికల ప్రచారం చేశారు. బహిరంగ సభలో విజయసాయిరెడ్డి మాట్లాడారు. వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని గెలిపిస్తే అశాంతి రాజ్యమేలుతుందన్నారు. ఇక్కడ జ న్మించిన జక్కా వెంకయ్య, పుచ్చలపల్లి సుందరయ్య పేదల కోసం వారు చేసిన పోరాటం మరువలేనిదన్నారు. స్థానిక ప్రజలు ఎంతో చైతన్యం కలిగినవారని, మంచి వ్యక్తిని ఎన్నుకునే విజ్ఞత గలవారన్నారు. ప్రసన్న మాట్లాడుతూ దామరమడుగు పంచాయతీలో డీబీటీ, నాన్‌ డీబీటీ ద్వారా రూ.47.36 కోట్లు, రేబాల గ్రామంలో రూ.35.20 కోట్ల మేర ప్రజలకు లబ్ధి జరిగిందన్నారు. నిత్యం పేద ప్రజల మధ్య ఉండే తనను, విజయసాయిరెడ్డిని గెలిపించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతా

బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ చైర్‌పర్సన్‌ మోర్ల సుప్రజను వేమిరెడ్డి దంపతులు భయపెట్టి, ప్రలోభాలకు గురిచేసి బలవంతంగా టీడీపీ కండువా కప్పారని ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. దామరమడుగులో ఆమె ప్రసన్నను కలిశారు. తాను ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌ చక్రవర్తి, మండల కన్వీనర్‌ సతీష్‌రెడ్డి, నాయకులు కార్యకర్తలు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబూ.. టీడీపీని ప్రజలెందుకు నమ్మాలి?

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


ఫ్యాన్‌ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: తెలుగుదేశం పార్టీని ప్రజలెందుకు నమ్మాలో చంద్రబాబు నాయుడు చెప్పాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి డిమాండ్‌ చేశారు. మండలంలోని సర్వేపల్లి, ఇస్కపాళెం, నిడిగుంటపాళెం గ్రామాల్లో ఆదివారం కాకాణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో కూటమి కట్టి అధికారాన్ని చేజిక్కించుకున్న చంద్రబాబు ఏ ఒక్క హామీని పూర్తిగా నెరవేర్చలేదని విమర్శించారు. రైతులు, మహిళలకు రుణమాఫీ చేస్తానని నమ్మించి మోసం చేశాడని గుర్తు చేశారు. బాబు మోసాలకు తగిన గుణపాఠం చెబుతూ రాష్ట్ర ప్రజలు 2019 ఎన్నికల్లో చిత్తుగా ఓడించారని తెలియజేశారు. 2024కు వచ్చే సరికి సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని ఒంటరిగా ఎదుర్కోలేక మరోసారి బీజేపీ, జనసేనతో పొత్తు పెట్టుకున్నాడన్నారు. చంద్రబాబు తన ఎన్నికల మేనిఫెస్టోలో ఆచరణకు సాధ్యం కాని హామీలను పొందుపరచడంతో నరేంద్రమోదీ ఫొటోను పెట్టేందుకు బీజేపీ ఒప్పుకోలేదన్నారు. బీజేపీకే టీడీపీ హామీలపై నమ్మకం లేకపోతే రాష్ట్ర ప్రజలు ఎందుకు నమ్మాలో సమాధానం చెప్పాలన్నారు.

నాడు జన్మభూమి కమిటీలు

చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీల పెత్తనంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడ్డారని కాకాణి తెలియజేశారు. 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చి వారి అభిమానాన్ని చూరగొన్నారని కొనియాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్లను లబ్ధిదారులకు అందించారన్నారు. బాబు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి వలంటీర్లు పెన్షన్లు పంపిణీ చేయకుండా అడ్డుకున్నారన్నారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నిరంతరం ప్రజా శ్రేయస్సు కోసం కృషి చేస్తున్న వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి సీఎంను చేసేందుకు వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్‌ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్‌ కొణిదెన మోహన్‌నాయుడు, జిల్లా నాయకులు ఆరుగుంట ప్రభాకర్‌రెడ్డి, కొణిదెన విజయభాస్కర్‌ నాయుడు, మురళీరెడ్డి, ఆరుగుంట జగదీష్‌రెడ్డి, ధీరజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నగదు, మద్యం సీజ్‌

నెల్లూరు(క్రైమ్‌): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసు అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఆదివారం కందుకూరులో ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.1.10 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు ఆత్మకూరులో 6, వింజమూరులో 12, మర్రిపాడులో 10, ఎస్‌ఈబీ అధికారులు 142 మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తుండగా సీజ్‌ చేశారు. మర్రిపాడులో 1,500 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేశారు.

బాలిక ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్‌): స్పష్టమైన కారణం తెలియదుగానీ ఓ బాలిక (13) ఆత్మహత్య చేసుకుంది. మధురానగర్‌కు చెందిన మమత నగరంలోని ఓ ప్రైవేట్‌ హాస్పిటల్లో వంట పనిచేస్తోంది. ఆమె కుమార్తె ఓ ప్రైవేట్‌ స్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతోంది. శనివారం మమత కావలికి వెళ్లింది. ఈ క్రమంలో బాలిక ఇంట్లోని ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రాత్రి ఇంటికి వచ్చిన మమత తలుపులు తెరిచేందుకు యత్నించింది. లోపల గడియవేసి ఉండడంతో స్థానికుల సహాయంతో పగులగొట్టి లోనికి వెళ్లింది. కుమార్తె ఉరేసుకుని కనిపించడంతో వెంటనే కిందకు దించి సమీపంలోని ప్రైవేట్‌ హాస్పిటల్‌కు తీసుకెళ్లింది. పరీక్షించిన వైద్యులు బాలిక మృతిచెందిందని నిర్ధారించారు. ఈ మేరకు బాధిత తల్లి ఆదివారం బాలాజీనగర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్‌ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరావాల్సి ఉంది.

స్వగ్రామాలకు వెళ్తుండగా..

- డివైడర్‌ను ఢీకొన్న మోటార్‌బైక్‌
- ఇద్దరు యువకుల మృతి

అద్దంకి: ఉన్నత చదువులు చదివి ఉద్యోగం సంపాదించి కుటుంబానికి అండగా నిలవాలని ఆ యువకులు కష్టపడుతున్నారు. అంతా బాగుందనుకుంటున్న సమయంలో రోడ్డు ప్రమాదం వారి కలల్ని చిదిమేసింది. మోటార్‌బైక్‌ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు మృతిచెందారు. ఈ ఘటన మండలంలోని అద్దంకి – నార్కెట్‌పల్లి రహదారిపై ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు జిల్లా కొడవలూరుకు చెందిన కంచి చరణ్‌ (22), కావలికి చెందిన రాజేశ్‌ (20) హైదరాబాద్‌లో చదువుకుంటున్నారు.. ఎన్నికల సమయం కావడంతో వారిద్దరూ మోటార్‌బైక్‌పై స్వగ్రామాలకు బయలుదేరారు. ఈ క్రమంలో బైక్‌ అద్దంకి పట్టణ సమీపంలోని విద్యుత్‌ కార్యాలయం వద్దకు రాగానే డివైడర్‌ను ఢీకొట్టడంతో యువకులకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదంతో చరణ్‌ అక్కడికక్కడే మృతిచెందగా, రాజేశ్‌ను చికిత్స నిమిత్తం ఒంగోలు తరలిస్తుండగా దారిలో చనిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరింత సంక్షేమం అందించేలా మేనిఫెస్టో

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు: 'సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఐదు సంవత్సరాల్లో ప్రతి కుటుంబానికీ పథకాలు అందించారు. మరింత సంక్షేమాన్ని అందించేలా మేనిఫెస్టోను రూపొందించారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్‌ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలి' అని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కోరారు. మండలంలోని పొంగూరుకండ్రిక, పొంగూరు, కేతిగుంట, పల్లిపాడు గ్రామాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు చేయించారన్నారు. కానీ ప్రతిపక్ష పార్టీ అభ్యర్థి ఈ ప్రాంతానికి వచ్చి అసలు అభివృద్ధే జరగలేదని మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబును నమ్మి అధికారం ఇస్తే సంక్షేమ పథకాలను రద్దు చేస్తారని వివరించారు. ఆయన గతంలో అధికారంలోకి వచ్చేందుకు రైతులకు, పొదుపు మహిళలకు రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి తదితర హామీలిచ్చాడని, కానీ ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. దీంతో ఇటీవల టీడీపీ విడుదల చేసి మేనిఫెస్టోపై ప్రజలకు నమ్మకం లేదన్నారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. ఆయన చెబితే తప్పక చేస్తారని జనం నమ్ముతున్నారన్నారు. జగనన్నను ఎదుర్కొనేందుకు చంద్రబాబు ఒక సినిమా స్టార్‌ను తీసుకొచ్చాడన్నారు. ఆయన సినిమాల్లో నటిస్తే బాగుంటుందని, ప్రజాక్షేత్రంలో మాత్రం వద్దన్నారు. బాబుపై నమ్మకం లేకే మేనిఫెస్టోపై నరేంద్రమోదీ ఫొటో వేసేందుకు బీజేపీ ఒప్పుకోలేదన్నారు. 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఫ్యాన్‌ గుర్తుపై ఓటు వేసి నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని, ఆత్మకూరు ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు మేకపాటి పృథ్వీరెడ్డి, పార్టీ మాజీ కన్వీనర్‌ గంగవరపు శ్రీనివాసులునాయుడు, నాయకులు అంబటి కృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సుబ్బారావు, రఘురాం నాయుడు, మాజీ సర్పంచ్‌ జంగంరెడ్డి, పెగళ్లపాడు సర్పంచ్‌ లక్ష్మి శ్రీనివాస్‌యాదవ్, రామ్మోహన్‌ యాదవ్, ఒంటెద్దు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సవాల్‌ను స్వీకరించే దమ్ముందా చంద్రబాబూ?

- కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ ఖాన్‌



ఆత్మకూరు: 'సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం రిజర్వేషన్లకు సంపూర్ణ మద్దతు ఉంటుందని చెప్పారు. బీజేపీతో జతకట్టి ఎన్నికల్లో పోటీ చేస్తున్న చంద్రబాబు రిజర్వేషన్లు కొనసాగాల్సిందేనని బహిరంగంగా చెప్పగలరా?, ఈ విషయంలో సీఎం సవాల్‌ను స్వీకరించే దమ్ముందా' అని కర్నూలు ఎమ్మెల్యే అబ్దుల్‌ హఫీజ్‌ ఖాన్‌ ప్రశ్నించారు. ఆత్మకూరు పట్టణంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. దివంగత సీఎం వైఎస్‌ రాజశేఖర రెడ్డి 2004లో రాష్ట్రంలో 4 శాతం రిజర్వేషన్లను ముస్లింలకు కల్పించారన్నారు. సీఏఏ, ఎన్‌ఆర్‌సీ, యూనిఫాం సివిల్‌ కోడ్‌పై టీడీపీ వైఖరి చెప్పాలని డిమాండ్‌ చేశారు. ముస్లింలకు నష్టం కలిగించే అంశాలకు మద్దతు ఇవ్వబోమని బహిరంగంగా ప్రకటించి ఓట్లు అడగాలన్నారు. వారికి అన్యాయం జరిగితే తాను వ్యతిరేకిస్తానని బీజేపీ నాయకులతో చెప్పిన అనంతరం బాబు ప్రచారం చేయాలన్నారు. టీడీపీ మోసం చేస్తోందని ముస్లింలకు ఎప్పుడో అర్థమైపోయిందని, వారందరూ వైఎస్సార్‌సీపీ అండగా ఉన్నట్లు చెప్పారు.

నాడు – నేడుతో ప్రభుత్వ బడులకు కొత్త కళ


ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఆదాల, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

- నెల్లూరు రూరల్‌ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన నాడు – నేడు పథకంతో ప్రభుత్వ బడులు కొత్త కళ సంతరించుకున్నాయని ఆ పార్టీ నెల్లూరు రూరల్‌ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్‌ మండలంలోని గమళ్లపాళెం, కల్లీకాలనీ, కోడూరుపాడు ప్రాంతాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్‌ జానా నాగరాజ్‌గౌడ్, మాజీ కార్పొరేటర్‌ లేబూరు పరమేశ్వర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్‌షోలో ఆదాల మాట్లాడారు. పార్టీలు మారే నాటకాల రాయుళ్ల బెదిరింపులకు ఎవరూ భయపడొద్దన్నారు. కోడూరుపాడు గ్రామానికి ఇప్పటి వరకు రూ.24 కోట్లకు పైబడి నిధులు ఖర్చుపెట్టి అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయించినట్లు చెప్పారు. పేదింటి పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్‌ ఆనం విజయకుమార్‌రెడ్డి, ఎంపీపీ బూడిద విజయకుమార్‌ యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి లంకా రామశివారెడ్డి, రూరల్‌ పరిశీలకుడు మల్లు సుధాకర్‌రెడ్డి, రెండో డివిజన్‌ కార్పొరేటర్‌ పడిగినటి రామ్మోహన్‌ యాదవ్, ఏఎంసీ వైస్‌ చైర్మన్‌ ఒట్టూరు సుధాకర్‌ యాదవ్, వి.సుధాకర్‌రెడ్డి, నాగ శ్రీనివాస్‌రెడ్డి, లేబూరు అమర్నాథ్‌రెడ్డి, బొమ్మి శ్రీనివాసులురెడ్డి, బొమ్మి వెంకటరెడ్డి, షేక్‌ మౌలా, సొసైటీ అధ్యక్షుడు నడవటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా

- వైఎస్సార్‌సీపీ ఉదయగిరి అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి


మహిళలతో మాట్లాడుతున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

వింజమూరు(ఉదయగిరి): తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఉదయగిరి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బుక్కాపురం, చవటపాళెం, చంద్రపడియ, చింతలపాళెంలో ఆయన ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయసాయిరెడ్డి సహకారంతో ఉదయగిరి ప్రాంతాన్ని డెల్టాతో సమానంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో 40 ఏళ్ల నుంచి మేకపాటి కుటుంబం విద్య, ఇతర మౌలిక వసతుల కల్పన కోసం ఎంతో కృషి చేసిందన్నారు. ఇది మరింత ముందుకు సాగాలంటే ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. పేదల పక్షాన పోరాడే జగనన్నకు మద్దతివ్వాలో.. పెత్తందారులకు ప్రతినిధిగా ఉన్న చంద్రబాబుకు అవకాశమివ్వాలో ఆలోచించాలని కోరారు. పొరపాటున బాబుకు అవకాశమిస్తే పేదలు అన్యాయమైపోతారని, పెత్తందారులు దోపిడీ చేస్తారన్నారు. పేదల సంక్షేమం కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం శ్రమించిన వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి సీఎంను చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు రేవునూరు శ్రీనివాసులురెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఆనంగి రమణయ్య, స్థానిక నేతలు పల్లాల కొండారెడ్డి, ఎం.విజయ్‌రెడ్డి, కాటంరెడ్డి రమణారెడ్డి, సర్పంచ్‌ రసూల్, కాటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తిరుపతిరెడ్డి, లక్ష్మీరెడ్డి, రవికుమార్‌రెడ్డి, మహేష్‌ తదితరులు పాల్గొన్నారు.

గెలిపించండి.. అండగా ఉంటా

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్‌ అహ్మద్‌


వృద్ధురాలికి కరపత్రం అందజేస్తున్న ఖలీల్‌ అహ్మద్‌

నెలూరు(వీఆర్సీసెంటర్‌): ఎన్నికల్లో తనను గెలిపిస్తే అన్ని వర్గాలకు అండగా ఉండి సమస్యలను పరిష్కరిస్తానని వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్‌ అహ్మద్‌ తెలిపారు. నగరంలోని 53వ డివిజన్‌ పరిధిలో ఉన్న గాంధీగిరిజన కాలనీ, వారధి సెంటర్, షుగర్‌ ఫ్యాక్టరీ రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఆయన ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటే మరింత సంక్షేమం ప్రతి కుటుంబానికి అందుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో బాగి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్‌ ధరలు

బ్రాయిలర్‌ (లైవ్‌)	: 152
లేయర్‌ (లైవ్‌)	: 90
బ్రాయిలర్‌ చికెన్‌	: 266
బ్రాయిలర్‌ స్కిన్‌లెస్‌	: 296
లేయర్‌ చికెన్‌	: 153



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.100
సన్నవి	: రూ.60
పండ్లు	: రూ.40




బుర్రా సమక్షంలో టీడీపీ నాయకుల చేరిక


మధుసూదన్‌ యాదవ్‌ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన రాళ్లపాడు వాసులు

కందుకూరు: ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న కొద్దీ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. కందుకూరు పట్టణంలోని 13వ వార్డుకు చెందిన 25 కుటుంబాలు టీడీపీని వీడాయి. వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌ యాదవ్‌ సమక్షంలో ఆదివారం పార్టీలో చేరాయి. వార్డులో జరిగిన ఈ కార్యక్రమంలో బుర్రా వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. గుమ్మడి వెంకట్రావు, గుమ్మడి భాస్కర్, చెంచయ్య, షేక్‌ షంషీర్‌ బాబు, కాలేషా, ఎస్‌కే మహబూబ్‌బాషా, షాహిద్, మన్సూర్, షామినా, ఫాతిమా, జరీమా, కరిముల్నీషా తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. అలాగే గుడ్లూరు మండలం రాళ్లపాడులో టీడీపీకి చెందిన 10 కుటుంబాలు బుర్రా సమక్షంలో పార్టీలో చేరాయి. గొల్లప్రోలు రవి, కొల్లూరు కొండయ్య, పాపబోయిన మహేంద్ర, దగ్గుమాటి రవి తదితరులు చేరిలో వారిలో ఉన్నారు. సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచిని ప్రజలకు వివరించి ఓట్లు వేయించాలని ఈ సందర్భంగా బుర్రా వారికి సూచించారు. పార్టీలో చేరిన వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

మళ్లీ గోవర్ధనుడే



▸▸ సర్వేపల్లి.. వైఎస్సార్‌సీపీ కంచుకోట

- రెండు దశాబ్దాలుగా టీడీపీకి నో ఛాన్స్
- తాజా ఎన్నికల్లోనూ స్పీడ్ పెరిగిన ఫ్యాన్ గాలి

సర్వేపల్లి మళ్లీ గోవర్ధనుడిదే అని ఎన్నికల వాతావరణం చెబుతోంది. వైఎస్సార్‌సీపీకి ఈ నియోజకవర్గం కంచుకోటగా చెప్పొచ్చు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావానికి ముందు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రాభవంతో ఇక్కడ రెండు దఫాలు కాంగ్రెస్, ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ మరో రెండు దఫాలు అప్రతిహతంగా విజయకేతనం ఎగుర వేశాయి. రెండు దశాబ్దాలుగా ఈ గడ్డపై టీడీపీ చీటి చినిగిపోయిందనే చెప్పాలి. ఈ దఫా ఎన్నికల్లోనూ ఫ్యాన్ స్పీడ్ మరింతగా పెరిగిందని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు.

జనాభాకు మించి సంక్షేమం

జనాభా -	2,83,500 మంది
ఓటర్లు -	2,32,057 మంది
డీబీటీ లబ్ధిదారులు -	3,70,395 మంది
నాన్ డీబీటీ లబ్ధిదారులు -	1,30,120 మంది
మొత్తం లబ్ధిదారులు -	5,00,515 మంది
డీబీటీ లబ్ధి -	రూ. 1,159 కోట్లు
నాన్ డీబీటీ లబ్ధి -	రూ. 448 కోట్లు
మొత్తం లబ్ధి -	రూ. 1,607 కోట్లు

పొదలకూరు : ఓ వైపు ఓటమి ఎరుగని ధీరుడు.. మరో వైపు సర్వేపల్లి జనం గుండెల నిండా నిండిన ప్రభావం తమైన వైఎస్సార్‌సీపీ జెండా. మరో వారంలో జరిగే ఎన్నికలు రేపటి తరం భవిష్యత్‌కు పునాది రాళ్లు కావడంతో ఈ దఫా వైఎస్సార్‌సీపీ గతం కంటే అత్యధిక మెజార్టీ సాధించబోతుందని రాజకీయ వర్గాల విశ్లేషణ. ఈ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీనే కాదు.. అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సైతం బలీయమైన శక్తిగా ప్రజల గుండెల్లో పాతుకుపోయారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గడిచిన ఐదేళ్లలో 90 శాతం కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించి.. వ్యక్తిగతంగా అభివృద్ధి సాధించేందుకు దోహదపడింది. నియోజకవర్గంలో జనాభాకు మించి సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఉన్నారంటే.. ప్రతి కుటుంబానికి రెండు.. అంతకు మించిన పథకాల ద్వారా లబ్ధి చేకూరింది. సంక్షేమంతో పాటు వ్యవసాయం, పారిశ్రామికాభివృద్ధిని పరుగులు పెట్టించడంతో కాకాణి చూపించిన చొరవతో గెలుపు నల్లేరుపై నడకే అయినా.. ఈ దఫా మెజార్టీ ప్రాధాన్యతను సంతరించుకోనుంది.

ఎన్నిక ఎన్నికకు.. కాకాణి అప్రతిహత ప్రభ

కాకాణి ఈ నియోజకవర్గం నుంచి 2014లో తొలిసారిగా ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు ఆయనకు ప్రధాన ప్రత్యర్థిగా రాజకీయ కుట్రలు, కుతంత్రాల్లో ఆరితేరిన సోమిరెడ్డి తప్పుడు కేసులు పెట్టించి ఉక్కిరిబిక్కిరి చేసినప్పటికీ ఆ ఎన్నికల్లో 5,500 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఆ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాకపోయినప్పటికీ కాకాణి చేతిలో ఓడిపోయిన సోమిరెడ్డి అడ్డదారిలో మంత్రి పదవి దక్కించుకుని తన ప్రత్యర్థి కాకాణిని, ఆయన అనుచరులను అనేక ఇబ్బందులకు గురి చేసినా వెరవక ఎదురొడ్డి పోరాడు. ప్రతిపక్షంలో ఉన్నా.. నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రజాపక్షంగా ఉండి నిరంతరం పోరాడాడు. సోమిరెడ్డి దాష్టీకాలకు గురైన ప్రజలకు అండగా నిలబడ్డారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా కాకాణి ఐదేళ్ల పాటు ఎన్నో పోరాటాలు చేసి పోలీసు కేసులను మోయాల్సి వచ్చింది. కాకాణి మడమ తిప్పకుండా అధికారం, కేసులకు భయపడకుండా సోమిరెడ్డిని ఎదుర్కొన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ తప్పిదాలను ఎత్తి చూపేవారు. తన వర్గానికి అన్యాయం చేస్తే న్యాయ స్థానాలను ఆశ్రయించి మరీ వారికి న్యాయం జరిగేలా కృషి చేశారు. దీంతో కాకాణికి ప్రజాబలం పెరిగింది. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో కాకాణి తిరిగి సోమిరెడ్డిపై గతం కంటే మిన్నగా 14 వేల ఓట్ల మెజారిటీతో వరుసగా రెండో పర్యాయం విజయం సాధించారు. రెండున్నరేళ్ల తర్వాత మంత్రి పదవి చేపట్టారు.

ఐదేళ్లుగా అభివృద్ధి మంత్రం

వైఎస్సార్‌సీపీ వచ్చాక నేలటూరు థర్మల్ విద్యుత్ ప్లాంట్‌తో పాటు, వెంకటాచలం మండలం సర్వేపల్లిలో రూ.610 కోట్లతో క్రిప్కో బయోఇథనాల్ ప్లాంట్, రూ.315 కోట్లతో విశ్వ సముద్ర బయోఇథనాల్ ప్లాంట్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. పొదలకూరులో రెండేళ్ల క్రితం వ్యవసాయ పనిముట్లు, యంత్రాల తయారీ కోసం కిసాన్ క్రాఫ్ట్ పరిశ్రమను రూ.100 కోట్లతో స్థాపించారు. మనుబోలు వద్ద ఎన్‌హెచ్ 16 హైవే రోడ్డు పనులను రూ.135 కోట్లతో పునర్నిర్మాణం చేశారు. సర్వేపల్లి నియోజకవర్గంలో రూ.130 కోట్లతో ఆర్‌అండ్‌బీ రహదారులను అభివృద్ధి చేశారు. 117 పంచాయతీల్లో రూ.375 కోట్లతో మౌలిక (అంతర్గత రోడ్లు, సైడ్ డ్రెయిన్లు) సదుపాయాలను కల్పించారు. రూ.92 కోట్లతో జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికి మంచినీటిని అందించేందుకు కుళాయి కనెక్షన్ అందజేసే పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

సోమిరెడ్డి రాజకీయ భవిష్యత్‌కు ఎప్పుడో సమాధి

సర్వేపల్లి ప్రజలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికు రెండు దశాబ్దాల క్రితమే సమాధి కట్టేశారు. 1999 ఎన్నికల్లో గెలిచిన సోమిరెడ్డి ఆ తర్వాత జరిగిన 2004, 2009, 2014, 2019 ఎన్నికల్లో వరుస ఓటముల పాలయ్యాడు. సోమిరెడ్డికి సరైన ప్రత్యర్థి లేకపోవడంతో 1999 ఎన్నికల్లోనూ గెలిచాడే తప్ప.. జనం ఆయన్ను ఎప్పుడో రాజకీయంగా తొక్కిపడేశారని రాజకీయ వర్గాల్లో చర్చ. సోమిరెడ్డి 1994లో ఎమ్మెల్యేగా గెలిచాక చంద్రబాబు కోటరీలో చేరి మంత్రి కూడా అయ్యారు. 1999 ఎన్నికల్లో గెలిచాక మంత్రి పదవి లభించకపోవడంతో మరో మంత్రిపై కుట్రలు చేసి ఆ స్థానాన్ని లాక్కున్నాడు. 1995 నుంచి 2004 వరకు సోమిరెడ్డి చేసిన అవినీతి అంతా ఇంతా కాదు. అప్పట్లో 'పనికి ఆహారం పథకం పేరుతో రూ.కోట్లు దోచుకున్నాడు. నకిలీ ఎరువులతో రైతులను కడుపులు కొట్టాడు. అందుకే గత 20 ఏళ్లుగా రాజకీయంగా సోమిరెడ్డికి సర్వేపల్లి ప్రజలు సమాధి కట్టారు. అయితే 2014లో అడ్డదారిలో మంత్రిగా వచ్చిన సోమిరెడ్డి తీరు మార్చుకోకుండా అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారు. ప్రధానంగా రైతుల జీవితాలను సర్వనాశం చేశాడు. రైస్‌మిల్లర్లతో మిలాఖాత్ అయి రూ.వందల కోట్లు ముడుపులు తీసుకుని ధాన్యం ధరలకు నియంత్రణ లేకుండా నిర్ణయాలు తీసుకున్నాడు. ఇక సాగునీటి కాలువల అభివృద్ధి పేరుతో దోపిడీ చేశాడు. రైతాంగం ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంలో 2019లో మరో సారి మట్టి కరిపించిన ప్రజలు.. మరోసారి కూడా మట్టి కరిపించడానికి ప్రజలు 'సిద్ధం'గా ఉన్నారు.

టీడీపీ ర్యాలీ అనుమతిపై వివాదం

ఉదయగిరి: పట్టణంలో తెలుగు యువత ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన ర్యాలీ అనుమతి వివాదాస్పదంగా మారింది. టీడీపీ శ్రేణులు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న శివాలయం వద్ద నుంచి పంచాయతీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించాలని తలపెట్టాయి. ఇందుకు సంబంధించి ముందుగానే అధికారుల నుంచి అనుమతి తీసుకున్నారు. ఈ మార్గంలోని జూనియర్ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రానికి నలువైపులా వంద మీటర్ల వరకు 144 సెక్షన్ అమల్లో ఉంది. నిబంధనల మేరకు ఈ మార్గంలో నలుగురికంటే ఎక్కువ మంది గుంపుగా వెళ్లేందుకు వీల్లేదు. అయినా టీడీపీ నేతలు ర్యాలీని ప్రారంభించిన వెంటనే సీఐ గిరిబాబు వారిని ఆపే ప్రయత్నం చేశారు. అనంతరం వారిని ఆర్వోతో మాట్లాడించి అనుమతించారు. ఈ క్రమంలో తెలుగుతమ్ముళ్లు పెద్దఎత్తున ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద టీడీపీకి అనుకూలంగా నినాదాలు చేస్తూ హంగామా సృష్టించారు. అక్కడే ఉన్న వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. ఈ ర్యాలీలో చిక్కుకున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని ఉద్దేశించి వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ కారుపై పిడిగుద్దులు గుప్పించారు. అయినా ఆయన సంయమనం పాటించడంతో ఎలాంటి వివాదం జరగలేదు. నిబంధలకు విరుద్ధంగా తెలుగు యువత ర్యాలీకి అధికారులు అనుమతి ఇవ్వడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మేకపాటిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని ఆర్వో రాజారమేష్ ప్రేమ్ కుమార్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. ఈ విషయమై ఆర్వోను వివరణ కోరగా టీడీపీ ర్యాలీకి ముందుగానే అనుమతి ఇచ్చామని తెలిపారు. ఫెసిలిటేషన్ సెంటర్ సమీపంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారన్నారు.

ఉదయగిరి తీర్పు.. విలక్షణం


మాదాల జానకిరాం


మేకపాటి రాజమోహన్‌రెడ్డి


మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి


కంభం విజయరామిరెడ్డి


మేకపాటి రాజగోపాల్‌రెడ్డి


వెంకయ్యనాయుడు

- మొదటి సారి పరాజయం.. ఆ తర్వాతే విజయం
- వెంకయ్యనాయుడికే తొలిసారే విజయం
- ఉద్దండులకే తప్పని ఓటమి
- ఈ దఫా ఎన్నికల్లో ఇద్దరూ కొత్త అభ్యర్థులే
- విజయం ఎవరిని వరిస్తుందోనని ఆసక్తి

జిల్లా రాజకీయ ముఖచిత్రంలో ఉదయగిరికి ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. స్వాతంత్ర్యానికి పూర్వం రాజులు, నవాబులు, ఆంగ్లేయుల పాలనా కేంద్రంగా కొనసాగింది. ప్రజాస్వామ్య దేశంగా ఏర్పడిన తర్వాత నుంచి నేటి వరకు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన తీర్పు విలక్షణంగా ఉంది. జిల్లాలో నైసర్గికంగా 8 మండలాలతో సువిశాల భూభాగం కలిగిన నియోజకవర్గంగా ఉదయగిరి కొనసాగుతోంది. జిల్లాలో వెనుకబడిన మెట్ట నియోజకవర్గం అయినప్పటికీ ఇక్కడి ఓటర్లు రాజకీయంగా చైతన్యవంతులుగా రాణిస్తున్నారు. ప్రముఖుల రాజకీయ ప్రస్థానానికి దారులు వేసిన ఉదయగిరి ఓటర్లు పలు సందర్భాల్లో ఇచ్చిన తీర్పు విలక్షణంగా కనిపిస్తోంది.

ఉదయగిరి: ఉదయగిరి అసెంబ్లీ స్థానంలో సెంటిమెంట్ కొనసాగుతోంది. ఈ నియోజకవర్గం నుంచి బరిలో దిగిన ఎవరైనా తొలి సారి ఓటమిని చవిచూడాల్సిందే. ఆ తర్వాతే విజయం దక్కుతోంది. 1978 అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచి 2019 సార్వత్రిక ఎన్నికల వరకు ఈ విలక్షణమైన తీర్పే కనిపిస్తోంది. మాజీ మంత్రి మాదాల జానకిరాం, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంభం విజయరామిరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, బొల్లినేని వెంకటరామారావులు మొదటి సారిగా ఈ నియోజకవర్గం నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి పరాజయం పొందారు. అయితే మరో ప్రత్యేకత ఈ నియోజకవర్గం నుంచి తొలి సారిగా బరిలోకి దిగి విజయం అందుకున్న చరిత్ర మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడుకే దక్కింది.

➡ 1978లో ఉదయగిరి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి మొదటి సారిగా మాదాల జానకిరాం, జనతా పార్టీ నుంచి ముప్పవరపు వెంకయ్యనాయుడు పోటీ పడ్డారు. ఆ ఎన్నికల్లో ఇద్దరూ తొలిసారిగానే పోటీ చేసినప్పటికీ వెంకయ్యనాయుడును విజయం వరించింది.

➡ 1983లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మేకపాటి రాజమోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి మొదటి సారి.. అప్పట్లో ఆయనకు ప్రత్యర్థిగా బీజేపీ నుంచి ఎం.వెంకయ్యనాయుడు పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో మేకపాటి రాజమోహన్‌రెడ్డి పరాజయం పొందారు. ఈ ఎన్నికల్లోనూ వెంకయ్యనాయుడే విజయం సాధించారు.

➡ 1985లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన మేకపాటి రాజమోహన్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన కంభం విజయరామిరెడ్డిపై విజయం సాధించారు.

➡ 1989 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన మాదాల జానకిరాం, టీడీపీ అభ్యర్థిగా కంభం విజయరామిరెడ్డి తలపడగా ఈ ఎన్నికల్లో మాదాల జానకిరాం గెలుపొందారు.

➡ 1994 ఎన్నికల్లో కంభం విజయరామిరెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా, కాంగ్రెస్ అభ్యర్థిగా మాదాల జానకిరాం పోటీ చేయగా కంభం విజయరామిరెడ్డి విజయం సాధించారు.

➡ 1999 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా కంభం విజయరామిరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పోటీ చేయగా ఈ ఎన్నికల్లో కంభం విజయరామిరెడ్డిని విజయం వరించింది.

➡ 2004 ఎన్నికల్లో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ తరఫున, కంభం విజయరామిరెడ్డి టీడీపీ తరఫున పోటీ చేయగా ఈ ఎన్నికల్లో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి గెలుపొందారు.

➡ 2009 ఎన్నికల్లో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా, కంభం విజయరామిరెడ్డి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేయగా మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి విజయం సాధించారు.

➡ 2012 ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా బొల్లినేని వెంకటరామారావు, వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పోటీ చేశారు. చంద్రశేఖరెడ్డి విజయం సాధించారు.

➡ 2014 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా బొల్లినేని వెంకటరామారావు, వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పోటీ చేయగా ఈ ఎన్నికల్లో బొల్లినేని వెంకట రామారావు గెలుపొందారు

➡ 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా బొల్లినేని వెంకటరామావు, వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పోటీ చేయగా మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి గెలుపొందారు.

ప్రధాన పార్టీల నుంచి కొత్తవారే పోటీ

అయితే ఈ దఫా జరగనున్న ఎన్నికల్లో ప్రధానంగా తలపడుతున్న వైఎస్సార్‌సీపీ నుంచి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, టీడీపీ నుంచి కాకర్ల సురేష్ బరిలో నిలబడ్డారు. ఈ ఇద్దరు అభ్యర్థులు తొలి సారిగా పోటీ చేస్తున్నారు. ఇంతవరకు చరిత్రను పరిశీలిస్తే మొదటి సారి పోటీ చేసిన అభ్యర్థులకు పరాజయం తప్పలేదు. అయితే ఈ రికార్డును బ్రేక్ చేసేందుకు ఇద్దరూ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఈ దఫా ఎన్నికల్లో ఎవరు గెలిచినా సెంటిమెంట్ మారుతుందని.. భవిష్యత్ అదే కొనసాగుతుందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. దాదాపు ఐదు దశాబ్దాలుగా కొనసాగుతున్న విలక్షణమైన ఉదయగిరి ఓటరు తీర్పులో విజయం ఎవరిని వరించనుందో జూన్ 4వ తేదీ వరకు వేచి చూడాల్సిందే.

టీడీపీకి నో ఛాన్స్

నెల్లూరు సిటీ: నెల్లూరురూరల్ నియోజకవర్గం 2009లో పునర్విభజనలో జనాభా ప్రాతిపదికన కొత్త గా ఏర్పడింది. ఇప్పటి వర కు మూడు దఫాలు ఎన్నికలు జరిగితే టీడీపీకి ఇంత వరకు ఛాన్స్ రాలేదు. నియోజకవర్గం ఏర్పడినప్పుడు తొలిసారిగా 2009 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన దివంగత ఆనం వివేకానంద రెడ్డి (కాంగ్రెస్) ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థి ఆనం వెంకటరమణారెడ్డిపై విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డిపై గెలుపొందారు. 2019 ఎన్నికల్లో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి (వైఎస్సార్‌సీపీ) అబ్దుల్‌అజీజ్ (టీడీపీ)పై గెలుపొందారు. ఈ నియోజకవర్గం నుంచి టీడీపీ తన సింబల్‌పై రెండో సారి పోటీ చేసింది. 2009లో సీపీఎం, 2014 ఎన్నికల్లో బీజేపీకి మద్దతు ఇచ్చింది. 2019 ఎన్నికల్లో మూడోసారి టీడీపీ అభ్యర్థిగా అబ్దుల్‌అజీజ్ పోటీ చేసి ఓటమి పాలయ్యారు.

ఓటు కాదంటే వేటు

- విధ్వంసానికి టీడీపీ కుట్ర
- ఓటమి తప్పదనే భయంతో పన్నాగం
- కావలిలో భారీగా స్థానికేతరుల పాగా
- లాడ్జిలు, ప్రైవేట్ గృహాల్లో వసతి ఏర్పాట్లు



కావలి: టీడీపీ ఇవే చివరి ఎన్నికలుగా భావిస్తోంది. కావలి నియోజకవర్గ క్షేత్రస్థాయిలో ఆ పార్టీకి గెలుపు అంచనాలు ఎక్కడా కనిపించడం లేదు. ప్రజలందరూ అధికార పార్టీకే మరోసారి జైకొట్టేందుకు సిద్ధంగా ఉన్నారనే లెక్కలు తేలిపోవడంతో ఆ పార్టీ అభ్యర్థి చివరి అస్త్రం ప్రయోగించేందుకు సిద్ధమయ్యారనే ప్రచారం కావలిలో ఊపందుకుంది. ఎన్నికల్లో రక్తపాతానికి తావు లేని కావలిలో ఈ దఫా ఎన్నికలు పల్నాడు, రాయలసీమ ఫ్యాక్షన్ తలపించే విధంగా ఉంటాయనే భావన కలిగించే రీతిలో తన సైన్యంతో సోషల్ మీడియాలతో ప్రచారం చేయిస్తున్నాడు. ఈ ప్రచారం పథకం ప్రకారమే జరుగుతుందని రాజకీయ పండితులు అభిప్రాయపడుతున్నారు. ఎలాగే గెలిచే అవకాశాలు లేవు కాబట్టి.. ఓటర్లను భయభ్రాంతులకు గురి చేయడం ద్వారా ఓట్లను వేయించుకోవాలనే కుట్రలకు పాల్పడుతున్న టీడీపీ వర్గాల ద్వారా విశ్వసనీయంగా అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. అభ్యర్థి వ్యవహారాలు, ఆయన అరాచకాలు, దాష్టీకాలు కావలి నియోజకవర్గ ప్రజలకు తెలియనది కాదు. తన వ్యవహారం తెలుసు కాబట్టి ఓటర్లు భయంతో తనకే వేస్తారనే భ్రమల్లో ఉన్నాడని కూటమి పార్టీల నేతలే చెబుతున్నారు. పోలింగ్ తేదీ దగ్గర పడుతుండటంతో మందు, నగదు పంపిణీ కోసం ఇప్పటికే బయట నుంచి పెద్ద సంఖ్యలో అనుచరులు, గుమాస్తాలను కావలికి రప్పించినట్లుగా తెలిసింది. టీడీపీ క్యాడర్‌ను పూర్తిగా పక్కన పెట్టి తన సొంత అనుచరగణంతోనే ఎన్నికలు పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తున్న విషయం విదితమే. మద్యం, నగదు పంపిణీతో పాటు పోలింగ్ రోజు గొడవలతో భయోత్పాత వాతావరణం సృష్టించేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు సొంత పార్టీ వర్గీయులే చెబుతున్నారు. 'తన ట్రీట్‌మెంట్ ఎలా ఉంటుందో ఇప్పటి వరకు ఉదయగిరి మాత్రమే చూసింది.. ఇప్పుడు కావలికి కూడా గుర్తుండిపోయేలా చేస్తా.. ఓట్లు తగ్గితే ఒక్కడిని కూడా వదిలిపెట్టను...' అంటూ అంతర్గత సమావేశాల్లో నేతలకు వార్నింగ్‌లు కూడా ఇస్తున్నట్లు కార్యకర్తలు చెబుతున్నారు. ఇందు కోసం బయట ప్రాంతాలకు చెందిన తన అనుచరులను కావలికి పిలిపించి లాడ్జిలు, ప్రైవేట్ గృహాల్లో వసతి ఏర్పాట్లు చేసినట్లు వినిపిస్తున్నాయి. ఇప్పటికే తన కనుసన్నల్లో ఉండే ఓ ప్రాంతంలో భారీగా మద్యం నిల్వలు కూడా డంప్ చేసినట్లుగా విశ్వసనీయంగా తెలిసింది. ఆది నుంచి ఆయన వైఖరి నచ్చక కూటమి పార్టీల నేతలు దూరంగా వెళ్లిపోయారు.

చిత్రం సాక్షిగా

బడి మెరిసెన్... చదువుల తల్లి మురిసెన్



మొత్తం పాఠశాలలు	405
నాడు నేడు ద్వారా ఆధునికీకరించిన పాఠశాలలు	209
నాడు-నేడు కోసం మొదటి విడత ఖర్చు	రూ. 23.88 కోట్లు
మొత్తం విద్యార్థులు సంఖ్య	25,759
ఉపాధ్యాయుల సంఖ్య	1201

ఐదేళ్లలో ప్రభుత్వ విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చదువులకు అగ్రస్థానం కల్పిస్తూ రూ.వేల కోట్ల వెచ్చించి ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. ప్రతి విద్యార్థి ఏకాగ్రతతో విద్యనభ్యసించే వాతావరణం కల్పించేలా క్లాస్ రూంలు, ఆధునిక డెస్క్‌లు ఏర్పాటు చేశారు. జగనన్న విద్యాకానుక ద్వారా నోటు పుస్తకాలు, బ్యాగులు బూట్లు, వర్క్ బుక్కులతో పాటు యూనిఫాం ఉచితంగా అందిస్తుండడంతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రాణిస్తున్నాయి. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో దృశ్య, శ్రవణ పరికరాలను ఏర్పాటు చేసి ఆధునిక పద్ధతుల్లో చదువు నేర్పిస్తుండడంతో విద్యార్థులు సైతం ఆసక్తిగా చదువు కొనసాగించేందుకు వీలు కలుగుతోంది. 8వ తరగతి నుంచి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేయడంతో గ్రామీణ ప్రాంతాల్లో సైతం పట్టణాలకు దీటుగా విద్యార్థులకు ఆధునిక విద్య అందుబాటులోకి వచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల విద్య తప్పనిసరిగా అమలు చేస్తుండడంతో కార్పొరేట్ పాఠశాలల విద్యార్థుల కంటే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. దానికి నిదర్శనం ఈ ఏడాది 10వ తరగతి పరీక్ష ఫలితాలే.


– ఆత్మకూరు



నాడు-నేడులో ఆహ్లాదకరంగా మారిన అనంతసాగరం మండలం మినగల్లు మండల ప్రజాపరిషత్ పాఠశాల


ఆధునికీకరించిన ఆరవీడు మండల ప్రజారిషత్ ప్రాథమిక పాఠశాల


ఆధునికీకరించిన ఏఎస్‌పేటలోని ఎంపీపీ పాఠశాల


ఆరవీడు పాఠశాలలో ఆధునికంగా మరుగుదొడ్లు